క్లుప్తంగా

గంజాయి కేసుల పురోగతిపై ఆరా


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: గంజాయి కేసుల పురోగతిపై ఎస్పీ డి.నరసింహ కిశోర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లోని ముద్దాయిల అరెస్టులు పూర్తి చేయాలని, న్యాయ శాఖ సహాయంతో ఇన్వెంటరీలను తొందరగా పూర్తి చేసి సకాలంలో చార్జీ షీట్లు వేయాలన్నారు. ముద్దాయిల అరెస్టులకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్.మురళీకృష్ణ, ఎల్.అర్జున్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పీఈ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిఫ్రిజిరేటర్ వితరణ



రూత్ వృద్ధాశ్రమానికి రిఫ్రిజిరేటర్ బహూకరిస్తున్న నక్కా రాజేంద్ర

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు మురళీకొండపై ఉన్న రూత్ వృద్ధాశ్రమంలో వృద్ధుల సౌకర్యార్థం గురువారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు నక్కా రాజేంద్ర రిఫ్రిజిరేటర్‌ను అందించారు. వృద్ధాశ్రమానికి ఏ అవసరం వచ్చిన తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో పలివెల స్వామి, రూత్ వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు సారె సమర్పణ

కడియం: దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు ఆషాఢ మాసం సందర్భంగా గురువారం సారె సమర్పించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పసుపు కుంకుమలు, పండ్లు, చీర, సారెలతో తరలివచ్చారు. ముందుగా గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం అమ్మవారికి సమర్పించారు.

చిన్నారి మృతి బాధాకరం


చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎంపీ పురందేశ్వరి

కడియం: అరుదైన వ్యాధితో బాధపడుతున్న మోహన వైద్యానికి అవసరమైన రూ.16 కోట్లు మంజూరుకు ప్రయత్నించామని, అంతలోనే చిన్నారి మృతి చెందడం బాధాకరమని ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో చిన్నారి తల్లిదండ్రులు ఈశ్వర్, శ్రావణిలను గురువారం ఆమె పరామర్శించారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జిల్లా బీజేపీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర తదితరులు ఆమె వెంట ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోందని, పోటీ చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయన గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో జిల్లా లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. విలీన గ్రామాల వివాదంతో కోర్టు కేసుల్లో ఆగిపోయిన ఎన్నికలు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. ఈ ఎన్నికలు డిసెంబర్‌లో ఉండవచ్చని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించారన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, జనరల్ సెక్రటరీ అరిగెల అరుణకుమారి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అమర్జహా బేగం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు

అనపర్తి: ఆరోగ్యవంతమైన దూడల కోసం పశువుల్లో గర్భకోశ వ్యాధులు, సమస్యల నివారణకు ముందస్తుగా పశు వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వై.వెంకటేష్ అన్నారు. గురువారం కుతుకులూరు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండపేట రాష్ట్ర పశువైద్య శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన గర్భకోశ వ్యాధి నిపుణులు శిబిరంలో జీవాలను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 40 గేదెలు, 15 ఆవులకు వైద్య సేవలు అందించినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.రామచంద్రారెడ్డి తెలిపారు.

దూకుడుకు బ్రేక్

- నగరంలో పోలీసుల తనిఖీలు
- హెల్మెట్ ధారణపై అవగాహన
- వాహన చోదకులకు కౌన్సెలింగ్


హెల్మెట్‌పై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కంబాలచెరువు: ఆధునిక కాలంలో ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. ప్రజలకు అవసరమైన కనీస అవసరాల పక్కన చేరింది. ఎందుకంటే నేడు ప్రతి పనికీ ద్విచక్ర వాహనం ఎంతో అవసరం. చదువు, ఉద్యోగం, వ్యాపారం, ప్రయాణం.. ఇలా అనేక అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే పురుషులు, మహిళలు, మేజర్లయిన పిల్లల అవసరాలకు అనుగుణంగా, వారు నడిపేందుకు వీలుగా అనేక రకాల మోడళ్లు మార్కెట్ లోకి విడుదలవుతున్నాయి. చాలామంది వాహన చోదకులకు తమ బండి పనితీరు, మైలేజీ, ఇతర ప్రత్యేకతలపై ఎంతో అవగాహన ఉంటుంది. కానీ వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు తెలియవు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీ

రోడ్డుపై వెళుతున్న సమయంలో అక్కడి ఉండే పోలీసులు, రవాణా శాఖాధికారులను చూసి చాలామంది వాహన చోదకులు తమ వాహనాలను వెనక్కు తిప్పేస్తారు. ఇరుకు వీధుల్లోంచి ముందుకు వెళ్లిపోతారు. ఎందుకంటే వారి దగ్గర వాహనానికి అవసరమైన పత్రాలు ఉండవు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించరు. లక్షల రూపాయలు పెట్టి బండిని కొనుగోలు చేసినా, రూ.వేలల్లో వచ్చే డ్రైవింగ్ లైసెన్స్‌పై నిర్లక్ష్యం చూపుతారు. అనుకోకుండా ట్రాఫిక్ పోలీసులకు దొరికిపోతే జరిమానా చెల్లించడానికి సిద్ధమవుతారు.

హెల్మెట్ లేకపోతే రూ.1035 జరిమానా

హెల్మెట్ ధరించపోతే జరిగే నష్టం, విధించే జరిమానాలపై రాజమహేంద్రవరం ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. చాలామంది వాహన చోదకుల వద్ద లైసెన్స్ ఉండదు. రహదారి నియమాలు తెలియవు. ముందు వాహనాన్ని అధిగమిస్తూ సర్రున దూసుకుపోవడం, సబ్ రోడ్ల నుంచి సడన్‌గా మెయిన్ రోడ్డులోకి వచ్చేయడం, ముందు చూపు లేకుండా దూసుకుపోవడం చేస్తుంటారు. ఇలాంటి సమయంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో హెల్మెంట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తగ్గుతుంది. దీంతో పోలీసులు నిరంతరం హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కేంద్ర రహదారి భద్రతా సమావేశంలో ప్రమాద మరణాలు తగ్గించాలంటే హెల్మెట్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జరిగే రహదారి ప్రమాదాల్లో ఎక్కువ శాతం మృతి చెందుతున్న వారిలో ద్విచక్ర వాహన చోదకులే అధికం. దీంతో వాహన చోదకుడిని హెల్మెట్ తప్పనిసరి చేశారు. దాన్ని ధరించకుంటే రూ.1035 జరిమానా విధించేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలపై రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని ఉద్దేశంతో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ పోలీసులు నిత్యం హెల్మెట్ ధరించడంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వాహనచోదకులకు కొత్త మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పిస్తూ, కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నగరంలోని ప్రవేశించే అన్ని రోడ్లలో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన ఫ్లెక్సీలు, ధరించకపోతే విధించే జరిమానాను తెలియజేస్తూ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

– షేక్ అబ్దుల్ నబీ, ట్రాఫిక్ సీఐ,

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

కడియం: కడియం– రాజవోలు మార్గంలో గల కడియం రైల్వే గేటును శుక్రవారం ఉదయం 7 నుంచి ఈ నెల 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేయనున్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖాధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా గేటును మూసివేస్తున్నామని, వాహనచోదకులు గమనించి సహకరించాలని కోరారు.

డంపింగ్ యార్డులో మంటలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డంపింగ్ యార్డులో బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో జాతీయ రహదారిపైనా, జేఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో పొగ కమ్ముకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ఉదయం వరకు పొగతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అధికారులు కొట్టించిన చెట్ల కొమ్మలను తీసుకువచ్చి ఈ డంపింగ్ యార్డులో పడేశారు. వాటికి ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో తదితరులు పరిశీలించారు.

జంతు సంరక్షణ సొసైటీలు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

- నిబంధనలు పాటించకుంటే చర్యలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: జంతు సంరక్షణ సొసైటీలను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎస్‌పీసీఏ (జంతువులపై హింస నివారణకు సొసైటీల ఏర్పాటు, నియంత్రణ) నియమాలపై తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధికారులతో జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జంతు హింస నివారణ చట్టాల అమలులో అలసత్వం ఉండరాదన్నారు. ఎస్‌పీసీఏ నియమాలను పాటించకపోతే కోర్టు ధిక్కారణ చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జంతువులపై హింసను నివారించడానికి సొసైటీలను ఏర్పాటు చేయాలన్న నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కొన్ని జిల్లాలలో సొసైటీలు, షెల్టర్లు లేవన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. వీటి కోసం అవసరమైన భూమి, నిధులు కేటాయించాల్సిందిగా ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించబడిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతి నెలా డీఎల్ఎస్ఏకు పంపాలన్నారు. హైకోర్టు తీర్పులో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తప్పక తీసుకోవాలన్నారు. జంతువులకు హక్కులు ఉంటాయని, వాటిని తరలించేటప్పుడు పశుగ్రాసం, నీరు తప్పక అందించాలన్నారు. వాహనాలలో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా, పరిమితికి మించి జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై పోలీసులు, రవాణా శాఖాధికారులు కేసులు నమోదు చేయాలన్నారు. పట్టణాలలో జంతువులను రోడ్లపై విడిచిపెట్టరాదని యజమానులకు సూచించారు. గాయపడిన జంతువుల చికిత్సకు అంబులెన్సులు ఉన్నాయని, దీనికి 1962 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్


షెల్టాన్ హోటల్ జంక్షన్‌లో మ్యాన్ హోల్

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం వేల వాహనాలతో రాకపోకలు సాగించే షెల్టాన్ హోటల్ జంక్షన్‌లో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా తయారైంది. దీనికి మరమ్మతులు చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో, స్థానికులు ఆ మ్యాన్ హోల్‌లో కర్ర పెట్టి రక్షణ ఏర్పాటు చేశారు. అయితే ఆ కర్రను రాత్రి సమయంలో పలువురు వాహన చోదకులు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. షెల్టాన్ హోటల్ జంక్షన్ నిత్యం అనేక వాహనాల రాకపోకలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా మీదుగా నడిచేందుకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం ఎర్నాకులం– పాట్నా (06085), ఈ నెల 28 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు ప్రతి సోమవారం పాట్నా –ఎర్నాకులం (06086) జిల్లా మీదుగా నడనున్నాయని రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. ఇవి రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఆగుతాయన్నారు.

ఎస్‌కేఆర్ కాంపోజిట్ కళాశాలను వేరు చేయాలి


ఇంటర్మీడియట్ కమిషనర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి కాంపోజిట్ కళాశాలగా నడుస్తున్న డిగ్రీ, ఇంటర్ కళాశాలలను వేరు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం ఇంటర్మీడియట్ కమిషనర్ కృతికా శుక్లా, ఉన్నత విద్యా మండలి డైరెక్టర్ నారాయణ భారత్ గుప్తాకు వినతిపత్రం అందించింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా కందుకూరి విద్యాసంస్థలు జీవో నెం.42 ప్రకారం ప్రభుత్వ పరమయ్యాయన్నారు. అయితే కళాశాల కంపోసిట్ కళాశాలగా నడుస్తుందని దీన్ని వేరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మాట్లాడుతూ రాజ్యలక్ష్మి కళాశాలలు ప్రభుత్వ పరం అయినా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు రావడం లేదని, మధ్యాహ్న భోజనం పథకం అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.జ్యోతిర్మయి, నాగ చైతన్య, కార్తిక్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే సమాజ అభ్యున్నతి



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

కోరుకొండ: ఉపాధ్యాయులతోనే సమాజ అభ్యున్నతి జరుగుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పల్ల రాజారావు అన్నారు. బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు, సంఘ సభ్యులను గురువారం కోరుకొండ సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజారావు మాట్లాడుతూ 1971లో తెలంగాణలో ఏర్పడిన పీఆర్‌టీయూ ఆంధ్రాలో కూడా విస్తరించబడి, బలమైన ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం అహర్నిశలు పోరాడుతోందన్నారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఆగ్నేష్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సభ్యులు విద్యాభివృద్ధితో ముందుంటారన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సాంబశివరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి షేక్ రహీమా బేగం, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్.లక్ష్మీనారాయణ, అర్జునరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: కొత్త విద్యుత్ లైన్ల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ వెంకటేశ్వర నగర్, స్వరూప నగర్, విద్యుత్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, చెరుకూరి ఫంక్షన్ హాల్ రోడ్డు, గోలి రామరావు వీధి, వాకర్స్ పార్కు రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్స్, కోదండ రామాలయం టెంపుల్ ఏరియా, వాకర్స్ రోడ్, జేఎన్ రోడ్, సుక్షేత్ర అపార్ట్‌మెంట్స్ ఏరియా, ఏవీ అప్పారావు రోడ్, వేంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, బాలాజీ స్ట్రీట్, అద్దేపల్లి కాలనీ, షీలా నగర్, శ్రీనివాస గార్డెన్స్, శ్రీనివాస నగర్, కోకా భాస్కరమ్మ నగర్, జయశ్రీ గార్డెన్స్ ఐదు వీధులు, పిల్లివారి వీధులు, మంతెన గార్డెన్స్, షిర్డీ సాయి మార్గ్, తోట రాములు నగర్, సాయి నేతాజీ నగర్, శారదా నగర్, గోపాల నగర్, పుంత, విద్యుత్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కోర్లంపేట, రామచంద్రరావు పేట, సాంబశివరావు పేట, తుమ్మలోవ, దేవీచౌక్, ఎన్టీఆర్ సెంటర్, కంబాల పేట, జాంపేట, అశోక థియేటర్ ప్రాంతం, అన్నపూర్ణమ్మపేట, మదన్ సింగ్ పేట ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.
- ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ రాయుడుపాకలు, కోలమూరు, కొంతమూరులోని పరిమి నగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ఏరియా, సాయిరాం కాలనీ, రాజరాజేశ్వరి నగర్, ఆఫీషియల్ కాలనీ, చందన రమేష్ లే అవుట్, ప్రభాకర్ స్కూల్ ఏరియా, నూకాలమ్మ గుడి ఏరియా, చెంచు కాలనీ, విడో కాలనీ, మసీదు ఏరియా, కల్యాణ్ నగర్, ఆదర్శ్ నగర్, జంగాల కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్ ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు.

దారుణ మోసం..

- నిరుద్యోగులకు కూటమి ఝలక్
- స్వయం ఉపాధి రుణాలకు బ్రేక్
- గొప్పగా ప్రచారం చేసుకున్న పాలకులు
- ఇంటర్వ్యూలు నిర్వహించాక చేతులెత్తేసిన వైనం


బిక్కవోలులో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు (ఫైల్)

బిక్కవోలు: స్వయం ఉపాధి రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. స్వయం ఉపాధి పొందాలనుకున్న వారి ఆశలపై నీరు చల్లింది. వివరాల్లోకి వెళితే.. వ్యాపారం, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాలు ఇస్తామని అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ప్రచారం చేసింది. సుమారు 50 శాతం రాయితీలో మంజూరు చేస్తామని గొప్పలు చేసుకుంది. ఆ విషయాన్ని నమ్మిన అనేక మంది నిరుద్యోగ యువత ఆశతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం వారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆ తర్వాత అంతా సైలెంట్ అయిపోయారు. రుణాలు ఎప్పుడిస్తారనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు.

దరఖాస్తుల వివరాలు			
మండలం	విభాగం	యూనిట్లు	దరఖాస్తులు
అనపర్తి	బీసీ	33	293
అనపర్తి	కాపు	7	52
అనపర్తి	ఈడబ్ల్యూఎస్	22	163
బిక్కవోలు	బీసీ	62	480
బిక్కవోలు	కాపు	17	111
బిక్కవోలు	ఈడబ్ల్యూఎస్	11	44
పెదపూడి	బీసీ	53	730
పెదపూడి	కాపు	24	40
పెదపూడి	ఈడబ్ల్యూఎస్	12	58
రంగంపేట	బీసీ	33	272
రంగంపేట	కాపు	41	182
రంగంపేట	ఈడబ్ల్యూఎస్	8	36
మొత్తం		376	2,461

ఊరూరా ప్రచారం

ఎన్ని లక్షల రూపాయల రుణానికైనా దరఖాస్తు చేసుకొండి, ఇచ్చేస్తాం అంటూ టీడీపీ కూటమి నాయకులు ఊరురా ప్రచారం చేసి ఊదర గొట్టారు. కులాల వారీగా ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. దీనిలో భాగంగా బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ తదితర కార్పొరేషన్లు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్లు జారీ చేశాయి. దీంతో వందల మంది నిరుద్యోగులు ప్రభుత్వం రుణాలిస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్నారు.

నిలిచిన ప్రక్రియ!

ఒక్కో మండలానికి వందలోపు మాత్రమే యూనిట్లు కేటాయించడం, ఒక్కో పంచాయతీలో ముగ్గురు, నలుగురు మాత్రమే రాయితీ రుణం పొందే అవకాశం ఉండడంతో దరఖాస్తుదారులు కూటమి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులను ఆశ్రయించి సిఫారసులు చేయించారు. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తి చేశారు. ఈ జాబితాలను బ్యాంకులకు చేరవేయగా, బ్యాంకు అధికారులు మళ్లీ వీరిలో కొందరిని ఎంపిక చేసి ఆ జాబితాను జిల్లా ఉన్నత అధికారుల అనుమతి కోసం పంపించారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అధికారులు నిలిపివేశారు.

పెరిగిన రాజకీయ జోక్యం

సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పెత్తనం సాగింది. వారు ఎవరి పేరు చెబితే వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీలు లేకపోయినా గ్రామాల్లో కూటమి వ్యవహారాలు చూస్తున్నా నాయకులు.. లబ్ధిదారుల జాబితాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. వీటిని అధికారుల వద్దకు ఎమ్మెల్యే పంపుతున్నారని తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారుల్లో నిరాశ అలుముకుంది.

నియోజకవర్గంలో 2,461 దరఖాస్తులు

నియోజకవర్గంలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్‌లకు 376 యూనిట్లు మంజూరు కాగా 2,461 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో బీసీ యూనిట్లు 181కి 1,775, కాపు యూనిట్లు 89కి 385, ఈడబ్ల్యూఎస్ యూనిట్లు 53కి 301 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

నమ్మించి మోసం చేయడమే..



సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండానే పూర్తిగా అమలు చేసేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపుతున్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. స్వయం ఉపాధి రుణాలు వస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చనే ఆశతో వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రుణాలు మంజూరు చేయకుండా మధ్యలో చేతులెత్తేసి నిరుద్యోగులకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఇది పక్కాగా నమ్మించి మోసం చేయడమే.

– పోతుల ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఊలపల్లి

చిత్తశుద్ధి ఉంటే కొనసాగించాలి



ప్రభుత్వానికి ప్రజలంటే అలుసా, స్వయం ఉపాధి రుణాలొస్తాయనే ఆశతో వందల మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. అంతా చేసి రుణాలు ఇవ్వాల్సిన సమయంలో చేతులెత్తేయడం ఏమిటి?. ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణాలు మంజూరు ప్రక్రియను కొనసాగించాలి.

– బొడ్డు ముత్యాలరావు, బీసీ నాయకుడు, పందలపాక

రక్తదానం శిబిరం

బిక్కవోలు: రక్త దానం చేయడం వల్ల మరో ప్రాణాన్ని కాపాడుకోవచ్చని సర్పంచ్ సత్యంశెట్టి వెంకట రమణ అన్నారు. మానవసేవే మాధవసేవ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కాపవరంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది రక్తదానం చేశారు. అనంతరం వారికి మొక్క, ధ్రువీకరణ అందజేశారు.ఎంపీటీసీ మార్నెళ్ల భీష్ముడు, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ చైర్మన్ సత్యంశెట్టి ఉమా మహేష్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	జూనియర్
సూర్యమినీ :	ఓ భామ అయ్యోరామ
సూర్యప్యాలెస్ :	కొత్తపల్లిలో ఒకప్పుడు
స్వామి :	కుబేర
అనుశ్రీ :	మె బేబీ
శివజ్యోతి :	వర్జిన్ బాయ్స్, తమ్ముడు
రాజా :	ఏమాయ చేసావే
ఊర్వశి :	3బీహెచ్‌కే
మేనక :	సూర్య సనాఫ్ కృష్ణన్, జురాసిక్ వరల్డ్
రంభ :	ఎఫ్–1 ది మూవీ, మార్గన్
అప్సర :	ఏమాయ చేసావే
అశోక :	జూనియర్
నామవరం	
వీఎస్ మహల్ :	జూనియర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	జూనియర్
కడియం	
వెంకటసూర్య :	జూనియర్